అర్ష్, అవేశ్ అదుర్స్

విజృంభించిన భారత పేసర్లు

దక్షిణాఫ్రికా 116 ఆలౌట్

భారత్ ఘనవిజయం

సాయి, శ్రేయస్ హాఫ్ సెంచరీలు

పేస్‌కు సహకరించే పిచ్‌లపై భారత యువ బౌలర్లు చెలరేగిపోయారు. సీనియర్ల గైర్హాజరీలో అవకాశం దక్కించుకున్న అర్ష్‌దీప్‌సింగ్, అవేశ్‌ఖాన్ ప్రత్యర్థిని గడగడలాడించారు.

రెండో ఓవర్లో ప్రారంభమైన వికెట్ల పతనం ఇక ఏ దశలోనూ ఆగలేదు. నిప్పులు చెరిగే బంతులతో అర్ష్‌దీప్, అవేశ్ నువ్వా నేనా అన్నట్లు పోటీ పడి ప్రొటీస్ పనిపట్టారు.

స్వల్ప లక్ష్యఛేదనలో అరంగేట్ర ఆటగాడు సాయి సుదర్శన్‌తో పాటు.. శ్రేయస్ అయ్యర్ అర్ధశతకం బాదడంతో టీమ్‌ఇండియా సునాయాసంగా విజయతీరాలకు చేరింది. తద్వారా వన్డే ప్రపంచకప్ ఫైనల్ పరాజయం అనంతరం టీమ్‌ఇండియా ఆడిన తొలి మ్యాచ్‌లో గెలుపు రుచి చూసింది.

అవేశ్ (4/27)

జొహన్నెస్‌బర్గ్: వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ ఓటమి తర్వాత ఈ ఫార్మాట్‌లో బరిలోకి దిగిన మొదటి మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన తొలి వన్డేలో భారత్ మరో 200 బంతులు మిగిలుండగానే 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. బంతుల పరంగా సఫారీ జట్టు పై టీమ్‌ఇండియాకు ఇదే అతి పెద్ద విజయం కావడం విశేషం. ఫలితంగా సిరీస్‌లో భారత్ 1-0తో ముందంజ వేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా.. 27.3 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. ఫెలుక్వాయో (33; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా.. జోర్జీ (28), కెప్టెన్ మార్క్‌రమ్ (12), షంసీ (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. హెన్రిక్స్ (0), డసెన్ (0) సున్నాలు చుట్టగా.. క్లాసెన్ (6), మిల్లర్ (2), ముల్డర్ (0) విఫలమయ్యారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ 5, అవేశ్ నాలుగు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో భారత్16.4 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 117 పరుగులు చేసింది. అంతర్జాతీయ స్థాయిలో తొలి వన్డే ఆడిన ఓపెనర్ సాయి సుదర్శన్ (43 బంతుల్లో 55 నాటౌట్; 9 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (52; 6 ఫోర్లు, ఒక సిక్సర్) హాఫ్ సెంచరీలు నమోదు చేసుకున్నారు. సఫారీ బౌలర్లలో ఫెలుక్వాయో, ముల్డర్ చెరో వికెట్ పడగొట్టారు. అర్ష్‌దీప్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య మంగళవారం రెండో వన్డే జరగనుంది.

నిప్పులు చెరిగిన పేసర్లు

బ్యాటింగ్‌కు స్వర్గధామమైన పిచ్‌పై టాస్ గెలిచిన సఫారీ జట్టు లక్ష్యాన్ని నిర్దేశించాలని నిర్ణయించుకుంది. పింక్ జెర్సీలో బరిలోకి దిగిన ప్రతిసారి భారీ స్కోరు చేసిన చరిత్ర ఉన్న సఫారీ జట్టు ఈసారి కూడా దంచికొడుతుందని అంతా భావిస్తే.. రెండో ఓవర్‌లోనే పరిస్థితి తలకిందులైంది. ఇప్పటి వరకు ఆడిన మూడు వన్డేల్లో ఒక్క వికెట్ కూడా తీయలేక పోయిన అర్ష్‌దీప్.. ఈ మ్యాచ్‌లో నిప్పులు చెరిగాడు. ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో బంతినందుకున్న అర్ష్‌దీప్ హెన్రిక్స్, డసెన్‌ను వరుస బంతుల్లో ఔట్ చేసి జట్టును ఆనందంలో ముంచెత్తాడు. కాసేపటికి జోర్జీ, క్లాసెన్ కూడా అర్ష్ బౌలింగ్‌లోనే బోల్తా పడ్డారు. మరో ఎండ్ నుంచి అవేశ్ కూడా రెచ్చిపోవడంతో వికెట్ల పతనానికి అడ్డు లేకుండా పోయింది. స్పిన్నర్ల రంగ ప్రవేశానికి ముందే దాదాపు పని పూర్తి కాగా.. ఆఖర్లో ఫెలుక్వాయో కాస్త పోరాడటంతో సఫారీ జట్టు కనీసం వంద పరుగుల మార్క్ దాట గలిగింది.

3 దక్షిణాఫ్రికా గడ్డపై 5 వికెట్ల ప్రదర్శన చేసిన మూడో భారత బౌలర్‌గా అర్ష్‌దీప్ నిలిచాడు. గతంలో నెహ్రా, చాహల్ ఈ ఫీట్ సాధించారు.

200 ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ రెండొందల బంతుల తేడాతో నెగ్గింది. దక్షిణాఫ్రికాపై మనకు ఇదే అతిపెద్ద విజయం.

1 అంతర్జాతీయ వన్డేల్లో అర్ష్‌దీప్ వికెట్ పడగొట్టిన మొదటి మ్యాచ్ ఇదే కాగా.. ఇందులోనే ఐదు వికెట్లు తీయడం విశేషం.

సాయి సుదర్శన్ (55*)

శ్రేయస్ (52)

"మ్యాచ్‌కు ముందు రోజు అక్షర్, అవేశ్ నేను కలిసి డిన్నర్‌కు వెళ్లినప్పుడు.. దక్షిణాఫ్రికాను 400 పరుగుల లోపు కట్టడి చేస్తే మంచిదే అని మాట్లాడుకున్నాం. వన్డేల్లో వీర బాదుడు బాదే ప్రొటీస్‌ను అడ్డుకట్ట వేయడం చాలా కష్టం అని అనుకున్నాం. అది కూడా వాళ్లు గులాబీ దుస్తుల్లో బరిలోకి దిగితే అడ్డుకోవడం కష్టం అని భావించాం. అయితే మ్యాచ్ మాత్రం అందుకు భిన్నంగా సాగింది. మరో ఎండ్ నుంచి అవేశ్ ఒత్తిడి పెంచడంతో ఆరంభంలోనే మ్యాచ్‌పై పట్టు సాధించగలిగాం. ఈ మ్యాచ్‌కు ముందు వరకు వన్డేల్లో ఒక్క వికెట్ కూడా పడగొట్టలేదు. అలాంటిది ఏకంగా ఐదు వికెట్లు ఖాతాలో వేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. -అర్ష్‌దీప్ సింగ్

4 అరంగేట్ర మ్యాచ్‌లో అర్ధశతకం బాదిన భారత నాలుగో ఓపెనర్‌గా సాయి సుదర్శన్ నిలిచాడు. గతంలో రాబిన్ ఉతప్ప, కేఎల్ రాహుల్, ఫైజ్ ఫజల్ ఈ ఘనత సాధించారు. ఓవరాల్‌గా తొలిపోరులో 50+ స్కోరు చేసిన 17వ ప్లేయర్ సాయి సుదర్శన్.

బంతుల తేడా పరంగా భారత్‌కు ఇది నాలుగో అతి పెద్ద విజయం. దక్షిణాఫ్రికాకు రెండో అతి పెద్ద ఓటమి.

అర్ష్‌దీప్ (5/37)

గులాబీ జెర్సీలో..

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించేందుకు దక్షిణాఫ్రికా జట్టు ఈ మ్యాచ్‌లో గులాబీ జెర్సీలతో బరిలోకి దిగింది.

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 27.3 ఓవర్లలో 116 ఆలౌట్ (ఫెలుక్వాయో 33, జోర్జి 28; అర్ష్‌దీప్ 5/37, అవేశ్ 4/27),
భారత్: 16.4 ఓవర్లలో 117/2 (సాయి సుదర్శన్ 55 నాటౌట్; శ్రేయస్ 52; ఫెలుక్వాయో 1/15).

పాకిస్థాన్‌కు ఘోర పరాభవం

తొలి టెస్టులో 360 పరుగుల తేడాతో ఆసీస్ జయభేరి

పెర్త్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా.. తొలి టెస్టులో పాకిస్థాన్‌పై ఘనవిజయం సాధించింది. నాలుగు రోజుల్లో ముగిసిన మ్యాచ్‌లో ఆసీస్ 360 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. ఓవర్‌నైట్ స్కోరు 84/2తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కంగారూలు.. 233/5వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేశారు. ఉస్మాన్ ఖవాజా (90; 9 ఫోర్లు), మిషెల్ మార్ష్ (63; 7 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. పాక్ బౌలర్లలో షహజాద్ మూడు వికెట్లు తీశాడు. అనంతరం 450 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన పాకిస్థాన్ ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. ఆసీస్ బౌలర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి 89 పరుగులకే కుప్పకూలింది. సౌద్ షకీల్ (24) టాప్ స్కోరర్ కాగా.. కెప్టెన్ షాన్ మసూద్ (2), అబ్దుల్లా (2), బాబర్ (14), సర్ఫరాజ్ (4), సల్మాన్ (5), ఫహీమ్ (5) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్, హజిల్‌వుడ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్న లియాన్ టెస్టు క్రికెట్‌లో 500 వికెట్ల మార్క్ దాటాడు. మిషెల్ మార్ష్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

ప్రవీణ్‌కుమార్‌కు రజత పతకం

కొత్తపల్లి, డిసెంబర్ 17: జాతీయ సబ్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తాచాటారు. కొచ్చి వేదికగా జరుగుతున్న పోటీల్లో రాష్ట్రానికి చెందిన ప్రవీణ్‌కుమార్ 35 కేజీల విభాగంలో రజత పతకం కైవసం చేసుకోగా.. 30 కేజీల విభాగంలో శివ, 50 కేజీల విభాగంలో జంపయ్య కాంస్యాలు దక్కించుకున్నారు. ఈ మేరకు తెలంగాణ జట్టు కోచ్, పెద్దపల్లి జిల్లా జోడో సంఘం కార్యదర్శి సిలివేరి మహేందర్ ఆదివారం వివరాలు వెల్లడించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, జనార్ధన్‌రెడ్డి, కైలాసం యాదవ్, కడారి అనంతరెడ్డి, అజీజ్, బాలరాజు, మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, సంజీవ్, సీహెచ్ రాము, నాగరాజు, రాజు, సాయిరాం యాదవ్, లింగమూర్తి, అబ్దుల్ బారి అభినందించారు.

ఖేలో ఇండియా పారా గేమ్స్ టేబుల్ టెన్నిస్ (టీటీ) సింగిల్స్‌లో రాష్ట్రానికి చెందిన హితేశ్ రజత పతకం సాధించాడు. ఆదివారం ఫైనల్లో హితేశ్ 2-3 (10-12, 11-8, 12-14, 17-15, 8-11)తో విశ్వ తాంబే (మహారాష్ట్ర) చేతిలో ఓటమి పాలయ్యాడు.

ఫిల్ సాల్ట్ సూపర్ సెంచరీ

వెస్టిండీస్‌పై మూడో టీ20లో ఇంగ్లండ్ ఘనవిజయం



ఫిల్ సాల్ట్ (109*)

గ్రెనడా: గత రెండు మ్యాచ్‌ల్లో ఏమాత్రం ప్రభావం చూపలేకపోయిన ఇంగ్లండ్ జట్టు.. తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో విజృంభించింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ఇంగ్లండ్ 7 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తుచేసింది. దీంతో ఇంగ్లిష్ సిరీస్‌లో 1-2తో నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (45 బంతుల్లో 82; 6 ఫోర్లు, 6 సిక్సర్లు) దంచికొట్టాడు. ఇంగ్లండ్ బౌలర్లలో సామ్ కరన్, ఆదిల్ రషీద్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 19.5 ఓవర్లలో 3 వికెట్లకు 226 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (56 బంతుల్లో 109 నాటౌట్; 4 ఫోర్లు, 9 సిక్సర్లు) అజేయ సెంచరీతో ఆకట్టుకోగా.. ఆఖర్లో లియామ్ లివింగ్‌స్టోన్ (30; 3 సిక్సర్లు), హ్యారీ బ్రూక్ (7 బంతుల్లో 31; ఒక ఫోర్, 4 సిక్సర్లు) మెరుపులు మెరిపించారు. చివరి ఓవర్‌లో ఇంగ్లండ్ విజయానికి 21 పరుగులు అవసరం కాగా.. రస్సెల్ బౌలింగ్‌లో బ్రూక్ వరుసగా 4,6,6,2,6 కొట్టి జట్టును గెలిపించాడు.

ఆసియా చాంప్ బంగ్లా

దుబాయ్: అండర్-19 ఆసియాకప్‌లో బంగ్లాదేశ్ విజేతగా నిలిచింది. సెమీఫైనల్లో భారత్‌పై గెలిచిన బంగ్లా.. ఆదివారం 195 పరుగుల తేడాతో యూఏఈని చిత్తుచేసి ట్రోఫీ కైవసం చేసుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. రహమాన్ (129) సెంచరీ చేయగా.. రిజ్వాన్ (60), ఆరిఫుల్ ఇస్లామ్ (50) అర్ధశతకాలు సాధించారు. యూఏఈ బౌలర్లలో అహ్మద్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో యూఏఈ 24.5 ఓవర్లలో 87 పరుగులకు ఆలౌటైంది. ధ్రువ్ (25 నాటౌట్) టాప్‌స్కోరర్. బంగ్లా బౌలర్లలో మారుఫ్, రోహనత్ చెరో మూడు వికెట్లు తీశారు.

భారత అమ్మాయిల ఓటమి

వెలెన్సియా: ఐదు దేశాల అంతర్జాతీయ హాకీ టోర్నీలో భారత మహిళల జట్టు పరాజయాల పరంపర కొనసాగుతున్నది. తొలి పోరులో స్పెయిన్ చేతిలో ఓడిన టీమ్‌ఇండియా.. ఆదివారం రెండో పోరులో టీమ్‌ఇండియా 1-2తేడాతో బెల్జియం చేతిలో ఓడింది. భారత్ తరపున వైష్ణవి (56వ నిమిషంలో) ఏకైక గోల్ చేయగా.. బెల్జియంకు అంబ్రే (22వ ని.లో), వెర్సవెల్ (37వ ని.లో) గోల్స్ అందించారు. మ్యాచ్ ఆరంభం నుంచే బెల్జియం ప్లేయర్లు పూర్తి ఆధిపత్యం కనబర్చగా.. మన అమ్మాయిలు వారికి పోటీ ఇవ్వలేకపోయారు. తదుపరి పోరులో మంగళవారం జర్మనీతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

న్యూజిలాండ్ శుభారంభం

- **బంగ్లాదేశ్‌తో తొలి వన్డే**

విల్ యాంగ్ (105)

డునెడిన్: బ్యాటర్ల జోరుకు, బౌలర్ల సహకారం తోడవడంతో.. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి వన్డేలో న్యూజిలాండ్ ఘనవిజయం సాధించింది. ఆదివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ 44 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం) విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 30 ఓవర్లకు కుదించగా.. తొలుత న్యూజిలాండ్ 7 వికెట్లు కోల్పోయి 239 పరుగులు చేసింది. ఓపెనర్ విల్ యాంగ్ (105; 14 ఫోర్లు, 4 సిక్సర్లు), కెప్టెన్ టామ్ లాథమ్ (92; 9 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించారు. బంగ్లా బౌలర్లలో షరీఫుల్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ 30 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 200 పరుగులకు పరిమితమైంది. అనాముల్ హక్ (43), అఫిఫ్ (38) పోరాడినా ఫలితం లేకపోయింది. కివీస్ బౌలర్లలో సోధి, క్లార్సన్, మిల్నే తలా రెండు వికెట్లు పడగొట్టారు. విల్ యాంగ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య బుధవారం రెండో వన్డ జరగనుంది.

శ్రీకర్ భరత్‌కు పిలుపు

సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ నుంచి వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తప్పుకోవడంతో.. అతడి స్థానంలో తెలుగు ఆటగాడు కోన శ్రీకర్ భరత్‌కు అవకాశం దక్కింది. వ్యక్తిగత కారణాలతో ఇషాన్ ఈ సిరీస్‌కు దూరం కావడంతో.. ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో పర్యటిస్తున్న భారత-'ఏ' జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న భరత్‌ను ఎంపిక చేశారు. 'ఇషాన్ ఈ సిరీస్ నుంచి మినహాయింపు కోరాడు. దీంతో సీనియర్ సెలెక్షన్ కమిటీ భరత్‌ను జట్టులో చేర్చింది' అని ఆదివారం బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సిరీస్ నుంచి టెస్టుల్లోనూ కేఎల్ రాహుల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు నిర్వర్తించనుండటంతో.. భరత్‌కు తుది జట్టులో చోటు దక్కడం అనుమానమే.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.